'ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలి'

శ్రీకాకుళం పాతబస్టాండ్ బీఆర్ అంబేడ్కర్ ఏపీ సాంఘిక సంక్షేమ గురుకులంలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో చేరేందుకు రాత పరీక్ష ద్వారా ఎంపికైన విద్యార్థులు ఆయా కళాశాలలకు ఈనెల 9వ తేదీలోగా ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని సాంఘిక సంక్షేమ గురుకులం జిల్లా కోఆర్డినేటర్ ఎన్.బాలాజీ ఓ ప్రకటనలో తెలిపారు. సంబంధిత గురుకులాల ప్రిన్సిపాళ్లను కలిసి అడ్మిషన్‌ను నిర్ధారించుకోవాలని సూచించారు. వారికి కేటాయించిన గురుకులంలో చేరాలని తెలిపారు.



ఈదురుగాలులు బీభత్సం

జిల్లాలో పలుచోట్ల ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. చెట్లు నేలకూలాయి.

- 8లో



సిద్ధమా.. అంటూ పార్టీ శ్రేణులను ఉత్సాహ పరుస్తున్న సీఎం వైఎస్ జగన్

జయహో.. జగన్



దిష్టంతా పోవాలి.. సీఎం బస్సు ముందు దిష్టి తీస్తున్న ఆడపడుచు

అపర భగీరథుడు



సీఎం వైఎస్ జగన్ జిల్లా ప్రజల పాలిట అపర భగీరథుడు. జిల్లాలో ఏర్పాటు చేసిన కిడ్నీ పరిశోధన కేంద్రం, హిరమండలంలో ఏర్పాటుచేసిన మంచినీటి ప్రాజెక్టు, మూలపేట పోర్టు అన్నీ ఆయన చలవే. జిల్లా అభివృద్ధి చెందాలంటే మళ్లీ ఆయనే రావాలి. – హరి మహాపాత్రో

కన్న కొడుకులా చూసుకుంటున్నాడు



ప్రతి నెలా ఒకటో తేదీకే నా ఇంటికే వచ్చి పింఛన్ వచ్చేలా చేశారు. సీఎం వైఎస్ జగన్ నా కన్న కొడుకులా ఆదుకుంటున్నారు. ఈ రెండు నెలలు పింఛన్లు సరిగ్గా అందక ఇబ్బందులు పడుతున్నాం. మళ్లీ జగన్ సీఎం అయితే ఆ ఇబ్బందులు ఉండవు. 104 ద్వారా ఇంటి వద్దనే మందులు అందజేస్తున్నారు.

– బోర పుష్పమ్మ, వృద్ధురాలు, ఇచ్ఛాపురం



ఫ్యాన్ గుర్తుతో యువతుల ఉత్సాహం



యువకుల కేరింతలు

మత్స్యకారులను ఆదుకున్నారు



మత్స్యకారుల కోసం సీఎం వైఎస్ జగన్ అనేక పథకాలు అమలు చేస్తున్నారు. మహిళలకు కూడా వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, అమ్మ ఒడి పథకాలు అందజేసి వారి ఆర్థిక ప్రగతికి దోహద పడ్డారు. ఇలాంటి సుపరిపాలన అందజేసిన ముఖ్యమంత్రిని ఇది వరకు ఎప్పుడూ చూడలేదు.

– నిట్ట అప్పన్న, నడుమూరు

అందరికీ పథకాలు అందుతున్నాయి



ఈ ప్రభుత్వ హయాంలో ప్రతి కుటుంబానికి మేలు జరిగింది. సచివాలయ వ్యవస్థ, నాడు–నేడుతో పాఠశాలలు, ఆస్పత్రులు అభివృద్ధి చేశారు. వలంటీరు వ్యవస్థతో ఇంటి వద్దకే సంక్షేమం అందజేశారు. మళ్లీ ముఖ్యమంత్రి కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం.

– లక్ష్మీనారాయణ, యువకుడు, రాణీగాం



ఇచ్ఛాపురం సభకు హాజరైన అశేష జన వాహినిలో కొంత భాగం

విజయం ఖాయం.. మేమంతా సిద్ధం

నినదించిన ఇచ్ఛాపురం

- ఇచ్ఛాపురంలో సీఎం వైఎస్ జగన్ సభకు వెల్లువలా తరలివచ్చిన జనం
- జగన్నినాదంతో మార్మోగిన గేట్ వే ఆఫ్ ఆంధ్రప్రదేశ్
- మధ్యాహ్నం ఒంటిగంటకే ఇసుకేస్తే రాలనంత జనం
- అధినేతకు నాయకుల ఘనస్వాగతం
- కార్యకర్తలకు ఊపునిచ్చిన జగన్ ప్రసంగం
- ఆద్యంతం ఈలలు వేస్తూ మద్దతు తెలిపిన అభిమాన తరంగం
- ఆనందోత్సాహాల నడుమ ఆడిపాడిన అక్కాచెల్లెమ్మలు

దారి పొడవునా జనహారం.. సభ జరిగిన చుట్టుపక్కల రోడ్ల నిండా ఇసుకేస్తే రాలనంతగా పోటెత్తిన జనప్రభంజనం. అభిమాన నాయకుడిని చూసిన ఆనందంలో కేరింతలు. ఆయన నోటి నుంచి వెలువడిన ప్రతి మాటకూ జేజేలు. ప్రతిపక్షంపై సంధించిన విమర్శల తూటాలకు మించి ప్రతిధ్వనించిన హర్షామోదాలు.. 'ఈ సారి ఇచ్ఛాపురంలో మార్పు ఖాయం.. దానికి మేం సిద్ధం' అంటూ వేలాది గొంతులు ఒక్కటై దిక్కులు పిక్కటిల్లేలా చేసిన నినాదాలతో ఇచ్ఛాపురం పట్టణం దద్దరిల్లింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మంగళవారం మధ్యాహ్నం నిర్వహించిన మేమంతా సిద్ధం సభ ఆ పార్టీ శ్రేణుల ఉత్సాహాన్ని ద్విగుణీకృతం చేసి.. కూటమి గుండెల్లో గుబులు రేపింది.



ఇచ్ఛాపురం ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌ను పరిచయం చేస్తున్న సీఎం వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

ఇచ్ఛాపురం జన సాగరమైంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాకతో గేట్ వే ఆఫ్ ఆంధ్రప్రదేశ్ దద్దరిల్లింది. ఎన్నికల ప్రచార సభకు కనీవినీ ఎరుగని రీతిలో జనం తరలివచ్చారు. మున్సిపల్ ఆఫీస్ కూడలి రోడ్డుకి అటు అటూ జనం కిక్కిరిసిపోయారు. పట్టణంలోని వీధులన్నీ జనంతో పోటెత్తాయి. అభిమానుల సందడితో ఇచ్ఛాపురంలో విజయోత్సవం కనిపించింది.

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాకతో మంగళవారం ఇచ్ఛాపురం మురిసిపోయింది. సంతపేట నుంచి ఇండియా గ్యాస్ గోడౌన్ వరకు రోడ్డు అంతా ఇసుకేస్తే రాలనంత జనంతో నిండిపోయింది. విశాఖపట్నం ఎయిర్‌పోర్టు నుంచి హెలికాప్టర్‌లో ఇచ్ఛాపురం చేరుకున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డి, పార్టీ రీజనల్ డిప్యూటీ కో ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు, పార్టీ ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ, నరసన్నపేట అభ్యర్థి ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్సీ నర్తు రామారావు, సమన్వయకర్త పిరియా సాయిరాజ్ తదితరులు స్వాగతం పలికారు. హెలీప్యాడ్ నుంచి బయల్దేరిన సీఎం జగన్ కోసం దారి పొడవునా



అభిమానులకు బస్సులో నుంచి అభివాదం చేస్తున్న సీఎం వైఎస్ జగన్

పెద్ద ఎత్తున జనం బారులు తీరారు.

సీఎం ప్రయాణించే వాహనానికి ఎదురుగా నిలబడి ..చిందులేసి....ఈలలతో తమ ఆనందాన్ని తెలియజేశారు. ఇక సభలో జగన్ మాట్లాడినంతసేపూ నినాదాలు, కేరింతలతో సందడి చేశారు. చంద్రబాబు ఒక్క మంచైనా చేశారా? మీ నియోజకవర్గాన్ని ఒక్క మేలైనా చేశారా? ప్రజలకు ఉపయోగపడే ఒక్క పథకమైనా అందించారా? గుర్తుండేలా ఒక్క అభివృద్ధి పనైనా చేశారా? మూడు సార్లు సీఎంగా చేశానని చెప్పుకుంటున్న చంద్రబాబుతో ప్రజలకు ఒరిగిందేమైనా ఉందా? అని సీఎం వైఎస్ జగన్ అడిగితే సభకు వచ్చిన జనం రెండు చేతులు పైకెత్తి లేదు...లేదు.. అంటూ నినదించారు.

ఎటు చూసినా జనమే..

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సభకు మధ్యాహ్నం ఒంటి గంట కల్లా నియోజకవర్గ నలుమూలల నుంచి ప్రజలు తరలివచ్చారు. ఆయన వచ్చేంతవరకు వేచి చూశారు. ఆయన వచ్చాక పులకించిపోయారు. సభలో ప్రసంగం ఆద్యంతం ఆసక్తిగా వినడమే కాదు హర్షధ్వానాలు తెలియజేశారు. సీఎం ప్రశ్నలకు సైగలతో బదులిస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. సభ ప్రాంగణానికి వచ్చిన దగ్గరి నుంచి తిరిగి హెలీప్యాడ్ వెళ్లేంతవరకు ఒక్కరూ కదల్లేదు. ఎక్కడి వాళ్లు అక్కడే ఉండిపోవడంతో కిక్కిరిసిన జనాల మధ్యే సీఎం జగన్ కాన్వాయ్ వెళ్లింది. సీఎం ఇచ్ఛాపురంలో అడుగు పెట్టిన దగ్గరి నుంచి తిరిగి వెళ్లేంతవరకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. దారి పొడవునా జనం జేజేలు పలికారు. ఉద్దానం కోసం, ఇచ్ఛాపురం కోసం, జిల్లా కోసం, ఉత్తరాంధ్ర కోసం ఏమేం చేశారో చెప్పినప్పుడైతే ప్రజలు పెద్ద ఎత్తున హర్షధ్వానాలు వ్యక్తం చేశారు. మోసాలు చేసిన చంద్రబాబును నమ్ముతారా.. అన్నప్పుడు 'నమ్మం బాబు' అని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. చెల్లెమ్మ విజయ ఎమ్మెల్యే అభ్యర్థిగా... పేరాడ తిలక్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారని, వీరిని గెలిపిస్తే మంచి చేస్తారని, ప్రజలకు మెరుగైన సేవలందిస్తారని చెబుతూ వారిని చేత్తో పట్టుకుని ప్రజలందరికీ అభివాదం చేయించిన దృశ్యాలైతే ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆ సందర్భంలో ప్రజలంతా తమ మద్దతును తెలియజేయడం ప్రత్యేకంగా కనిపించింది.

సీఎం పర్యటనలో మత్స్యశాఖ, పశు వైద్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, నియోజకవర్గ పరిశీలకుడు చింతాడ రవికుమార్, సీడాప్ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్ రెడ్డి, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నరేష్‌కుమార్ అగర్వాలా(లల్లూ), ఇచ్ఛాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, ఎంపీపీలు బోర పుష్ప, పైల దేవదాస్‌రెడ్డి, డాక్టర్ నిమ్మన దాస్, కవిటి మండల నేత కడియా ప్రకాశ్, మున్సిపల్ వైస్ చైర్మన్లు లాభాల స్వర్ణమణి, ఉలాల భారతి దివ్య, జెడ్పీటీసీ సభ్యులు ఇప్పిలి లోలాక్షి, తడక యశోద, ఉప్పాడ నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.





సీఎం వైఎస్ జగన్ చిత్రపటంతో ఓ యువకుడు

వైఎస్సార్ కుటుంబంతోనే జిల్లా అభివృద్ధి: తిలక్

వైఎస్ రాజశేఖర రెడ్డి, వైఎస్ జగన్ హయాంలోనే జిల్లా అభివృద్ధి చెందిందని వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ అన్నారు. జిల్లాలో అంబేడ్కర్ యూనివర్సిటీ, శ్రీకాకుళంలో రిమ్స్, ఫేజ్–2 వంశధారను వైఎస్సార్ నిర్మిస్తే.. తర్వాత వైఎస్ జగన్ మూలపేటలో పోర్టు నిర్మించి ప్రపంచంతో అనుసంధానం చేస్తున్నారని తెలిపారు. ఉద్దానం సమస్య గురించి నాయకులంతా హామీలు ఇచ్చి వెళ్లిపోయారని, వైఎస్ జగన్ ఒక్కరే పనులు చేశారని గుర్తు చేశారు. హిరమండలం నుంచి నీటిని తీసుకురావడంతో పాటు పలాసలో కిడ్నీ ఆస్పత్రి ఏర్పాటు చేశారని తెలిపారు. 2014లో ముఖ్యమంత్రి కావడం కోసం చంద్రబాబు అనేక హామీలిచ్చి మోసం చేశారని, ఇప్పుడు మళ్లీ మోసం చేయడానికి సిద్ధమైపోయారని విమర్శించారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు నిమ్మగడ్డ రమేష్‌తో కోర్టులో కేసు వేసి వృద్ధులను క్షోభకు గురి చేశారని అన్నారు. కూటమి ఇచ్చిన హామీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని అన్నారు. ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల రైతులకు సాగునీరు అందించేందుకు వంశధార కుడికాలువను ఇచ్ఛాపురం వరకు పొడిగించాలని ఆయన సీఎంను కోరారు.

ఇచ్ఛాపురానికి అశోక్ చేసిందేమిటి..?

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ సూటి ప్రశ్న

కంచిలి: పదేళ్ల పదవీ కాలంలో ఇచ్ఛాపురం నియోజకవర్గానికి బెందాళం అశోక్ చేసిందేమిటని వైఎస్సార్ సీపీ ఇచ్ఛాపురం ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ సూటిగా ప్రశ్నించారు. ఇచ్ఛాపురం పట్టణంలో మంగళవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్వహించిన మేమంతా సిద్ధం సభలో ఆమె ప్రసంగించా రు. తాను రెండున్నరేళ్లు జెడ్పీ చైర్ పర్సన్ పదవి చేపట్టి ఎన్నో పనులు చేశానని, కానీ పదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్న అశోక్ అభివృద్ధిని విస్మరించారని విమర్శించారు. అశోక్ నిత్యం రాకపోకలు సాగించే సోంపేట–కవిటి–ఈదుపురం–ఇచ్ఛాపురం రోడ్డును తానే వేశానని, అశోక్ కేవలం పెళ్లిళ్లు, ఇతర ఫంక్షన్‌లకు వెళ్లడం తప్ప, ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. ఇచ్ఛాపురం నియోజకవర్గం అభివృద్ధి జరగాలంటే కేవలం వైఎస్ జగన్‌తోనే సాధ్యమవుతుందన్నారు.

ఉద్దానం ప్రాంతాన్ని పట్టి పీడిస్తున్న కిడ్నీ వ్యాధి పరిష్కారానికి రూ.700 కోట్లతో వైఎస్సార్ సుజలధార నిర్మించారని గుర్తు చేశారు. పలాసలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ రెండు పనులు చేసిన వైఎస్ జగన్‌కు ఉద్దానం రుణపడి ఉంటుందని తెలి పారు. ఇక్కడ రెండుసార్లు ఎంపీగా ఎన్నికైన కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఈ ప్రాంత అభివృద్ధికి ఏమీ చేయలేదని అన్నారు.

2014లో టీడీపీ ఎన్నో హామీలు ఇచ్చిందని, కానీ ఏదీ నిలబెట్టుకోలేదని అన్నారు. కానీ ఐదేళ్ల పాలనలో వైఎస్ జగన్ చెప్పిన పనులన్నీ చేశారని వివరించారు. వైఎస్ జగన్ పథకాలను కాపీ కొట్టి చంద్రబాబు మోసం చేయడానికి సిద్ధమయ్యారని దుయ్యబట్టారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి తనతో పాటు ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌ను గెలిపించాలని కోరారు.



అభిమాన నాయకుడి మాస్కులతో యువత సందడి



సభ మధ్యలో అంబులెన్స్‌కు దారిస్తున్న దృశ్యం..



బస్సు ఎక్కి మరీ అభిమాన నాయకుడిని చూస్తున్న ప్రజలు

క్లుప్తంగా

10లోపు ఉచిత సీట్లలో చేరాలి


ఆర్.జయప్రకాష్

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యాహక్కు చట్టం ప్రకారం కార్పొరేట్/ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశాలకు ఉచిత అడ్మిషన్లు లభించిన విద్యార్థులను ఈ నెల 10లోపు ఎంపికైన స్కూల్లో చేర్పించాల్సి ఉంటుందని సమగ్రశిక్ష శ్రీకాకుళం జిల్లా అదనపు ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ (ఏపీసీ) డాక్టర్ రోణంకి జయప్రకాష్ తెలిపారు. మంగళవారం సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్ట్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాల కోసం 3,185 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్టు చెప్పారు. మొదటి దశలో 796 మందిని పాఠశాల విద్య ఉన్నతాధికారులు తగు అర్హతలు ఆధారంగా ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థుల సమాచారాన్ని తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా చేరవేసినట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో కూడా పొందుపర్చినట్టు చెప్పారు. ఈ నెల 10లోపు విద్యార్థులను పాఠశాలల్లో చేర్చాలని కోరారు. సంబంధిత ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల వద్ద నుంచి అదనపు ఫీజులు వసూలు చేయడానికి వీల్లేదని స్పష్టంచేశారు. ఫీజులు వసూలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ప్రైవేటు పాఠశాలలో విద్యాహక్కు చట్టం ప్రకారం అడ్మిషన్లు పూర్తిచేసిన విద్యార్థుల వివరాలతో రిజిస్టర్ నిర్వహించాలని సూచించారు.

చిట్ నిర్వాహకురాలిని నిలదీసిన బాధితులు


మహిళను ముట్టడించిన బాధితులు

టెక్కలి రూరల్: డబ్బులు చెల్లించకుండా పరారైన చిట్ నిర్వాహకురాలిని బాధితులు ముట్టడించిన ఘటన టెక్కలిలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాలు ప్రకారం.. టెక్కలి రోటరీనగర్–1లో నివాసముంటున్న మాగాపు సబితాదేవి కొన్నేళ్లు చిట్‌ఫండ్ వ్యాపారం చేసి గత ఏడాది రూ.3 కోట్లతో పరారైంది. అప్పటి నుంచి సుమారు 175 మంది బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఇప్పటి వరకు 17 మందికి ఐపీ నోటీసులు ఇచ్చినట్లు సమాచారం. ఆమె హైదరాబాద్‌లో ఉన్నట్లు తెలియడంతో బాధితులు ఏంచెయ్యలేని స్థితిలో ఉండిపోయారు. చివరకు మంగళవారం టెక్కలి రోటరినగర్–1 సమీపంలోని ఓ బ్యాంకుకు రహస్యంగా రావడం గుర్తించిన స్థానికులు బాధితులకు సమాచారం అందించగా అందరూ చేరుకుని నిలదీశారు. కొందరు ఆమె మెడలో ఉన్న వస్తువులు సైతం లాగేసినట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఆమెను స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి బెయిల్‌పై విడుదల చేశారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం


స్వాధీనం చేసుకున్న బాటిళ్లతో అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని ఎస్ఎంపురంలో అక్రమంగా తరలిస్తున్న 40 మద్యం బాటిళ్లను మంగళవారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బాటిళ్లు తరలిస్తున్న ముద్దాడ సూర్యనారాయణపై కేసు నమోదు చేశారు. తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్ ఎం.వి. గోపాలకృష్ణ, ఇంటెలిజెన్స్ ఇన్‌స్పెక్టర్ శంకరరావు, ఎస్ఐ మాధవి పాల్గొన్నారు.

విద్యుత్ ఏఈ, అకౌంట్స్ అధికారి సస్పెన్షన్

అరసవల్లి: లావేరు మండలంలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరులో అక్రమాలకు పాల్పడిన ఇద్దరు విద్యుత్ శాఖాధికారులపై ఈపీడీసీఎల్ ఉన్నతాధికారులు కొరడా ఝులిపించారు. లావేరులో అప్పట్లో ఏఈగా పని చేసిన తంగుడు వెంకట రమణమూర్తి (ప్రస్తుతం మెళియాపుట్టి ఏఈ), అప్పట్లో శ్రీకాకుళం ఈఆర్వో విభాగంలో ఏఏఓగా పని చేసిన పి.ప్రభాకరరావు (ప్రస్తుతం విశాఖ కార్పొరేట్ కార్యాలయం ఏఓ) లను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ సీఎండీ పృథ్వీతేజ్ ఉత్తర్వులు జారీ చేశారు. 2022–23లో లావేరు మండలంలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరులో పలు అక్రమాలకు పాల్పడినట్లుగా అందిన ఫిర్యాదుల మేరకు జరిపిన విచారణలో వీరిద్దరి పాత్రను నిర్ధారిస్తూ సస్పెన్షన్ వేటు విధించారు. వ్యవసాయదారులకు చెందిన పాత కనెక్షన్ల పేర్లు మార్చి కొత్తవారికి డబ్బులు తీసుకుని కనెక్షన్లు కేటాయించారనే విషయంలో అప్పట్లో 'సాక్షి'లో పలు కథనాలు ప్రచురితం చేసిన సంగతి తెలిసిందే. ఈ సస్పెన్షన్లను ఎస్ఈ ఎస్.కృష్ణమూర్తి ధృవీకరించారు.

రణస్థలం మండలంలోనూ విజిలెన్స్..

లావేరులో అక్రమాలపై చర్యలు చేపట్టిన క్రమంలో రణస్థలం నుంచి కూడా సీఎండీ కార్యాలయానికి పలు ఫిర్యాదులు చేరినట్లు సమాచారం. ఇక్కడ కూడా పలువురి వ్యవసాయ కనెక్షన్ల మంజూరుకు రూ.వేలల్లో లంచాలు వసూలు చేస్తున్నట్లుగా, స్థానిక స్టోర్స్‌లో ఉన్న విలువైన విద్యుత్ కేబుళ్లు, ఏబీ స్విచ్‌లు, ఇతర సామగ్రిని చోరీ చేయిస్తూ ఓ అధికారే తన మనుషులతో బయట వ్యాపారులకు విక్రయిస్తున్నట్లుగా ఫిర్యాదులు అందాయి. దీనిపై విజిలెన్స్ అధికారులతో పాటు శాఖాపరంగా కూడా ప్రస్తుతం విచారణ జరుగుతున్నట్లు అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది.

టీడీపీని వీడి.. వైఎస్సార్ సీపీలో చేరి..


కొత్తూరు: పార్టీలో చేరిన పానుటూరు గ్రామస్తులకు కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి


ఎచ్చెర్ల క్యాంపస్: బుడగుట్లపాలెంలో టీడీపీ, జనసేన కుటుంబాలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్


టెక్కలి: అసెంబ్లీ అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ సమక్షంలో పార్టీలో చేరిన టీడీపీ సీనియర్ నేత, మాజీ సర్పంచ్ ఎండ భాస్కరరావు

కొత్తూరు: మండలంలోని పానుటూరుకు చెందిన 50 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో మంగళవారం చేరాయి. పార్టీలో చేరిన వారిలో కొర్లాన అప్పలనాయుడు, అంధవరపు శ్రీనివాసరావు, పతివాడ వసంతరావు, బోహర సోమేశ్వరరావు, పుట్టముశెట్టి త్రినాథరావు తదితరులు ఉన్నారు. వీరందరికీ పాతపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి రెడ్డి శాంతి పార్టీ కండువాలను వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, సీనియర్ నాయకులు కలమట రమేష్‌బాబు, పీఏసీఎస్ డైరెక్టర్ గారరాజులు నాయుడు పాల్గొన్నారు.

● కోటబొమ్మాళి: మండలంలోని శ్రీజగన్నాథపురం పంచాయతీ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, 30 ఏళ్ల పాటు సర్పంచ్‌గా పనిచేసిన ఎండ భాస్కరరావుతోపాటు మరో 25 కుటుంబాల వారు అసెంబ్లీ అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంగళవారం పొడుగుపాడులో వీరికి కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో సర్పంచ్ నూక సత్యరాజు, పార్టీ నాయకులు దుబ్బ వెంకటరమణారావు, అన్నెపు రామారావు, రోణంకి మల్లయ్య, పేడాడ వెంకటరావు, చింతాడ అనిరుద్రుడు, జి.కేశవరావు, తలగాన గణపతి పాల్గొన్నారు.

● ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని తోటపాలేం పంచాయతీలో మాజీ సర్పంచ్ కడుపు శేఖర్ తన అనుచరులతో కలిసి వైఎస్సార్ సీపీలో చేరారు. మంగళవారం ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ శేఖర్ ఇంటికి వెళ్లి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం గ్రామంలో ప్రచారం నిర్వహించారు. కార్య క్రమంలో మాజీ సర్పంచ్ కళ్లేపల్లి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు. బుడగుట్లపాలెంలో సోమవారం రాత్రి టీడీపీ, జనసేన పార్టీల నుంచి 23 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి. కరగయ్య, సూరాడ కామరాజు, కారి రాంబాబు తదితరులకు ఎమ్మెల్యే కిరణ్ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు అంబటి రాంబాబు, మద్దు లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

● పాతపట్నం: మండలంలోని సీతారాంపల్లి గ్రామానికి చెందిన సుమారు 60 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి సమక్షంలో చేరాయి. పార్టీలో చేరిన వారిలో బొంగు అప్పారావు, సింహాచలం, సంతోష్, నాగభూషణరావు, లోకేశ్వరరావు, అశోక్, నగేష్, మధు, మక్కా లక్ష్మీకాంతం, మాక్క చంద్రమ్మ, బొంగు నీలమ్మ, బొంగు హేమలత, బొంగు గౌరమ్మ, మక్కా రమా, బి.రమాదేవి, జె.సుందరవతి, పి.సరస తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు ఎం.శ్యామ్‌సుందరావు, గంగు వాసుదేవరావు, మండల సచివాలయ కన్వీనర్ వై.సూర్యం, నాయకులు ప్రహ్లాద పుల్లాయ్, కుమార్ రెడ్డి, మురళీ అప్పో, దాసు రెడ్డి, సత్యబిస్వాల్, రామక్రిష్ణ, పనుకు మోహన్, సాయి, గోపి పాల్గొన్నారు.

● జలుమూరు: మండలంలోని మాకివలస, మూర్తిపేట, పర్లాం గ్రామాలకు చెందిన పాలిన జగ్గారావు, వంజరాపు రమణ, ఆవల అప్పన్న, జమ్ము అప్పన్న, గోవిందరావు, గడ్డయ్య, పిసినికి పెంటయ్య తదితర 50 కటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. వీరికి పార్టీ యువ నాయకులు కృష్ణ చైతన్య, రామలింగంనాయుడులు కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ వాన గోపి, వైస్ ఎంపీపీ తంగి మురళీకృష్ణ, సచివాలయ కన్వీనర్ ధర్మాన జగన్, అల్లు దాలప్పన్న, బొల్ల హేమరాజు, నవిరి పోతయ్య తదితరులు పాల్గొన్నారు.


జలుమూరు: పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న ధర్మాన రామలింగంనాయుడు


పాతపట్నం: పార్టీలో చేరిన సీతారాంపల్లి గ్రామస్తులకు కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి


ఎచ్చెర్ల క్యాంపస్: తోటపాలెంలో ఎమ్మెల్యే కిరణ్‌తో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మాజీ సర్పంచ్ కడుపు శేఖర్


జలుమూరు: పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న ధర్మాన కృష్ణచైతన్య

రామోజీరావు కళ్లున్న కబోది

- ఈనాడులో రోతరాతలు చూస్తే అసహ్యమేస్తోంది
- మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ధ్వజం


మహదేవిపురంలో వైస్ ఎంపీపీ తమ్మినేని శ్రావణితో కలిసి ప్రచారం చేస్తున్న మంత్రి అప్పలరాజు

వజ్రపుకొత్తూరు: తన పత్రికతో ఒక వర్గానికి ప్రయోజనం చేకూర్చాలనే తాపత్రయంతో ఈనాడు పత్రిక అధినేత రామోజీరావు కళ్లున్న కబోదిలా వ్యవహరిస్తున్నాడని వైఎస్సార్‌సీపీ పలాస నియోజకవర్గ అభ్యర్థి, మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని మహదేవిపురం, బెండి, బట్టుపాడు, నగరంపల్లి, పెద్దబడాం తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని మంగళవారం నిర్వహించారు. దీనిలో భాగంగా మహదేవిపురం గ్రామంలో మంత్రికి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు హనుమంతు వెంకటరావు దొర, వైస్ ఎంపీపీ తమ్మినేని శ్రావణి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి తమ్మినేని శాంతారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు దువ్వాడ మధుకేశవరావు, కొర్రాయి గోపి, గిరిబాబు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి అప్పలరాజు మాట్లాడుతూ.. పలాస నియోజకవర్గానికి కిడ్నీ పరిశోధన కేంద్రం తలమానికమన్నారు. 200 పడకల ఆస్పత్రిలో పూర్తిస్థాయి సిబ్బంది ఉండడంతో పాటు అత్యాధునిక వైద్య సదుపాయాలు అందుతున్నాయని తెలియజేశారు. నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధి జరిగిందని, ఇప్పటికే కొత్తపేట, దబ్బపాడు, అక్కుపల్లి, బెండి– నువ్వలరేవు, చీపురుపల్లి రహదారి పనులే అందుకు నిదర్శనమన్నారు. కానీ అభివృద్ధి జరగలేదని చెబుతూ ఈనాడు పత్రికలో రోత రాతలు చూస్తే అసహ్యమేస్తోందని మండిపడ్డారు. అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని కోరారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లువేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా పేరాడ తిలక్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పాలిన శ్రీనివాసరావు, రోణంకి శాంతికుమారి, వెంకటరమణ, సనపల సింహాచలం, చింత హేమారావు, టి.రామ్మూర్తి టి.కృపాకరరావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న నిర్ణయాలు చరిత్రాత్మకం

- వైఎస్సార్ సీపీ శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్


మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్. పక్కన ఎన్నికల పరిశీలకుడు కాయల వెంకటరెడ్డి

సంతబొమ్మాళి: ఈ ప్రాంత అభివృద్ధికి, జిల్లా గౌరవం పెరగడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాలు చరిత్రాత్మకమని వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ అన్నారు. మంగళవారం సంతబొమ్మాళి మండలం హనుమంతునాయుడుపేటలో రెడ్డిక కుల ఆత్మీయ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల పోర్టు కల జగన్‌మోహన్‌రెడ్డితో నెరవేరిందన్నారు. మూలపేట పోర్టు నిర్మాణంతో ఈ ప్రాంతమంతా పారిశ్రామికవాడగా తయారవుతుందని, ప్రపంచ దేశాలు మొత్తం ఇటు వైపే చూస్తున్నాయని చెప్పారు. స్థానికులకు ఉద్యోగ అవకాశాలు, భూమి ధరలు అమాంతంగా పెరిగాయన్నారు. మన ప్రాంతానికి గౌరవం పెరగడానికి జగనన్న తీసుకున్న నిర్ణయాలే కారణమని, రానున్న ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా చేద్దామని పిలుపునిచ్చారు. మూలపేట , విష్ణుచక్రం గ్రామానికి చెందిన రెడ్డిక కులస్తులు గ్రామాన్ని, భూములను స్వచ్ఛందంగా ఇచ్చారని, వారి త్యాగాలను భవిష్యత్ తరాలు స్మరిస్తాయని పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా దువ్వాడ శ్రీనివాస్‌ను, ఎంపీగా తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, టెక్కలి ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు కాయల వెంకటరెడ్డిలను రెడ్డిక సంఘం ప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పాల వసంతరెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ సుగ్గు పుణ్యావతి, రెడ్డికి సంఘం ప్రతినిధులు పి.రవికుమార్‌రెడ్డి, బల్లాడ జనార్దన్‌రెడ్డి, ఎస్.రామిరెడ్డి, సుగ్గు మధురెడ్డి, బల్లాడ హేమమాలినిరెడ్డి, త్రినాథ్‌రెడ్డి, బి.మోహన్‌రెడ్డి, మహేష్ రెడ్డి పాల్గొన్నారు.

జగన్‌తో పోటీ పడలేకే టీడీపీ దుష్ప్రచారం


రిమ్స్ హాస్పిటల్‌రోడ్డులో ర్యాలీగా వెళ్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

- మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ప్రజల భూములు తీసుకునే హక్కు దేశప్రధానికి గానీ, సీఎంకు గానీ ఉండదని, రాజ్యాంగంలో అలాంటి చట్టాలేవి రూపొందించలేదని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు స్పష్టం చేశారు. భూయాజమాన్య హక్కు చట్టంతో ప్రజల భూములన్నీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేతుల్లోకి వెళ్లిపోతాయని చంద్రబాబు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. శ్రీకాకుళం నగరంలోని బలగలో మంగళవారం వేలాది మందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జగన్‌తో పోటీపడే దమ్ములేక చంద్రబాబు, రామోజీలు తప్పుడు రాతలు రాసి ప్రజల్ని నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వానికి భూమి కావాలంటే 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం అందించి మాత్రమే భూమిని ప్రభుత్వం కొనుగోలు చేసుకుంటుంది తప్ప ఇష్టం వచ్చినట్లు తీసుకోడానికి కుదరదన్నారు. వైఎస్సార్, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలు ప్రజలకు ఆస్తినివ్వడమే గానీ, తీసుకునే వ్యక్తిత్వం కాదన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.12,800 కోట్లతో 31లక్షల మందికి ఇళ్ల పట్టాలు అందించినట్లు గుర్తు చేశారు. 65 ఏళ్ల క్రితమే నిరుపేదలకు సాగు చేసుకునేందుకు ఇచ్చిన భూమిపై వైఎస్సార్‌సీపీ హయాంలో సర్వహక్కులు కల్పించిన సంగతి గుర్తు చేశారు. చుక్కలభూముల్ని 3.60లక్షల ఎకరాలకు సాగుచేసుకునేలా చట్టం చేసి ఇచ్చినట్లు తెలిపారు. చంద్రబాబు రాజకీయ జీవితంలో మంచి చేసి ఓట్లడిగిన సంస్కృతి లేదన్నారు. బూటకపు హామీలతో అధికారం చేపట్టాలని యావ తప్ప నిజాయితీ పాలన అందించాలనే ఆలోచన ఏనాడూ లేదన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణ, సాధు వైకుంఠరావు, చల్ల అలివేలుమంగ, వరుదు విజయ్, బలగ గణపతి పటా్నయక్, ఎండ రమేష్, ఆబోతుల రామ్మోహన్‌రావు, అల్లు లక్ష్మీనారాయణ, పంకు ప్రసాద్, ఎం.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తత్కాల్ ద్వారా ఇంటర్ పరీక్ష ఫీజు స్వీకరణ


శ్రీకాకుళం న్యూకాలనీ: వివిధ కారణాలతో ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు చెల్లించలేని విద్యార్థులకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు తమ మార్కులను పెంచుకునేందుకు/ఉత్తీర్ణతకానీ సబ్జెక్టుల్లో పరీక్ష రాసేందుకు తత్కాల్ స్కీమ్ కింద ఈ నెల 8 నుంచి 10వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు పరీక్ష ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చు. రూ.3వేల అపరాధ రుసుంతోపాటు పరీక్ష ఫీజులను యథావిధిగా చెల్లించాల్సి ఉంటుందని ఇంటర్ బోర్డు స్పష్టంచేసింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఆర్ఐఓ ప్రగడ దుర్గారావు కోరారు. ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు చొరవ తీసుకుని శతశాతం ఫీజులు చెల్లించేలా చూడాలన్నారు.

శిష్టకరణాలంతా వైఎస్సార్‌సీపీతోనే

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సంక్షేమ, అభివృద్ధి పాలకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వెంటే శిష్టకరణాలంతా ఉంటారని, ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని శిష్టకరణ కార్పొరేషన్ డైరెక్టర్ సదాశివుని కృష్ణ, శ్రీకూర్మం దేవస్థానం బోర్డు మెంబర్ డబ్బీరు శ్రీనివాసరావు (వాసు) అన్నారు. శ్రీకాకుళం నగరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో వారు మాట్లాడుతూ కొన్ని దశాబ్దాల పోరాటం తర్వాత శిష్టకరణాలను బీసీ–డి జాబితాలో చేర్పించారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక కార్పొరేషన్ ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీని గెలిపించకపోతే భావితరాలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందన్నారు. బీసీ–డిలో ఉన్నందున జిల్లాలో 84 మంది డాక్టర్ కోర్సు చేస్తున్నారని, సుమారు రూ.11 కోట్ల మేర అమ్మఒడి, ఆసరా, చేయూత, విద్యాదీవెన, వసతి దీవెన, వాహన మిత్ర వంటి అనేక పథకాలు ద్వారా లబ్ధి పొందుతున్న విషయాన్ని గుర్తించాలన్నారు. సమావేశంలో పార్టీ ఉపాధ్యక్షులు రౌతు శంకరరావు, రఘుపాత్రుని వైకుంఠరావు, కె.అప్పలనాయుడులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సదాశివుని కృష్ణ, డబ్బీరు వాసు తదితరులు

ప్రమాదంలో గాయపడిన రిక్షా తాత మృతి


మృతదేహం వద్ద హెచ్‌సీ వెంకటరమణ

శ్రీకాకుళం క్రైమ్ : గత నెల 28న రెండోసారి రోడ్డు ప్రమాదానికి గురైన రిక్షా తాత కంతా రామారావు విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. రిక్షానే ఆవాసంగా మార్చుకున్న రామారావు గతంలో ఓసారి ప్రమాదానికి గురైతే ట్రాఫిక్ పోలీసులు ఆదుకుని దాతల సాయంతో రిక్షా అందజేసిన సంగతి తెలిసిందే. తర్వాత మళ్లీ గాయపడటంతో కేజీహెచ్‌లో చేర్పించారు. మంగళవారం ట్రాఫిక్ హెచ్‌సీ వెంకటరమణ, పీసీ నరేష్‌లు కేజీహెచ్‌లో వృద్ధుని మృతదేహానికి పోస్టుమార్టం చేయించి బూర్జలో ఉంటున్న సోదరుడు కాంతారావు, సోదరి లక్ష్మిలకు అప్పగించారు.

ఈదురుగాలుల బీభత్సం


హిరమండలం: అవలంగిలో నేలకొరిగిన విద్యుత్ స్తంభం


బూర్జ: రోడ్డుపై విరిగిపడిన చెట్టు కొమ్మలు

హిరమండలం: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. గాలుల ధాటికి అవలంగి పాఠశాల వద్ద విద్యుత్ స్తంభం నేలకొరిగింది. పలు గ్రామాల్లో చెట్టు కొమ్మలు విరిగిపడ్డాయి. దీంతో గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.


ఎచ్చెర్ల క్యాంపస్: మృతి చెందిన పాడి ఆవులు

ఎచ్చెర్ల క్యాంపస్: కుప్పిలి గ్రామంలో పశువుల పాకపై సోమవారం అర్ధరాత్రి పిడుగు పడింది. దీంతో అలుపున సీతయ్యకు చెందిన మూడు పాడి ఆవులు మృతి చెందాయి. పాలు అమ్మకం ద్వారా జీవనం సాగిస్తున్న ఈ కుటుంబానికి ఒక్కసారి రూ.రెండు లక్షలు వరకు నష్టం వాటిల్లడంతో బాధితులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

బూర్జ: మండలంలో మంగళవారం ఉరుములు, పిడుగులతో కూడిన వర్షం కురిసింది. పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి.



పొందూరు: ధర్మపురంలో రోడ్‌షోలో మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం



శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): పెద్దపాడులో ప్రచారంలో పాల్గొన్న మంత్రి ధర్మాన ప్రసాదరావు



ఎచ్చెర్ల క్యాంపస్: పూడివలసలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



వజ్రపుకొత్తూరు: ఎన్నికల ప్రచారంలో భాగంగా వజ్రపుకొత్తూరులో కొబ్బరిబొండాం తాగుతున్న మంత్రి సీదిరి అప్పలరాజు

విజయమే లక్ష్యం.. విస్తృత ప్రచారం..

మరికొద్ది రోజుల్లో పోలింగ్ జరగనున్నందున ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. బరిలో ఉన్న అభ్యర్థులంతా విజయమే లక్ష్యంగా విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తూ ఓటర్లను ఆకట్టుకునే పనిలో నిమగ్నమవుతున్నారు. విలువైన ఓటును తమకే వేయాలంటూ అభ్యర్థిస్తున్నారు. – సాక్షి నెట్‌వర్క్

ప్రచార పర్వం



మెళియాపుట్టి: పట్టుపురంలో ఎన్నికల ప్రచారంలో అశేష జనవాహినితో కలిసి ర్యాలీగా వస్తున్న పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి



టెక్కలి: అయోధ్యపురంలో ద్విచక్రవాహనంపై ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్



జలుమూరు: చిన్నదూగాంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

చేనేతకు చేయూత



మగ్గంపై నేత ప్రక్రియ

- చేనేతకు చేయూతనిచ్చిన సీఎం వైఎస్ జగన్
- నేతన్న నేస్తం కింద ఏటా రూ.24వేలు చొప్పున ఐదేళ్ల పాటు సాయం
- 3,812 మంది చేనేత కార్మికులకు రూ. 3 వేలు చొప్పున పింఛన్లు

పొందూరు: వైఎస్సార్ నేతన్న నేస్తం కింద ఏడాదికి రూ.24వేలు, నెలకు రూ.3వేలు పింఛన్, చేనేత క్లస్టర్ ఏర్పాటు.. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేనేత కుటుంబాలకు అందించిన సాయమిది. కల్లబొల్లి కబుర్లు చెప్పి కాలక్షేపం చేసే టీడీపీ నాయకుల కళ్లు తెరుచుకునేలా ఈ ఐదేళ్ల పాటు ఇచ్చిన మాట తప్పకుండా ఆయన అందించిన చేయూత ఇది. పాదయాత్రలో చేనేతల కష్టాలు కళ్లారా చూసి, వారి బాధలను అర్థం చేసుకుని నేతన్న నేస్తం పథకానికి ఆయన రూపకల్పన చేశారు. అధికారంలోకి వచ్చాక ఏటా ఓ తేదీ చెప్పి అదే తారీఖున రూ. 24వేలు నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేశారు.

జిల్లాలో నేతన్న నేస్తం ఇలా..

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	బ్యాంకు ఖాతాల్లో జమ చేసిన నగదు (రూ.కోట్లలో)
2019–20	1208	రూ. 2.89
2020–21	1208	రూ. 2.89
2021–22	1208	రూ.2.89
2022–23	1311	రూ. 3.14
2023–24	1460	రూ.3.50
మొత్తం		రూ.15.34

అర్హుల ఎంపికలో ఎలాంటి పక్షపాతం ప్రదర్శించకుండా తన మంచి మనసును చాటుకున్నారు. జిల్లాలో నేతన్న నేస్తం కింద ఐదేళ్ల పాటు దాదాపు రూ.15.34 కోట్లు ఖాతాల్లో జమ చేశారు. 3,812 మంది చేనేత కార్మికులకు రూ.3 వేలు చొప్పున పింఛన్లు అందజేస్తున్నారు. నేషనల్ హ్యాండ్‌లూం డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కాంపొనెంట్‌లో ఏర్పాటు చేసిన మూడు క్లస్టర్లకు రూ. 2.97 కోట్లు అందజేశారు. దీంతో చేనేత కార్మికులంతా సీఎంను వేనోళ్ల కీర్తిస్తున్నారు.



నేతన్న నేస్తం నగదు బ్యాంకు ఖాతాల్లో పడ్డాయని ఫోన్‌లో మేసేజ్‌లు చూపుతున్న కార్మికులు (ఫైల్)

పనికి గుర్తింపు.. శ్రమకు ఫలితం.. కార్మికుడికి తోడ్పాటు. చేనేతకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన చేయూత ఇది. ఐదేళ్లకు ఓ మారు నేతన్నల కష్టాలు నేతల నోటిలో హామీలుగా వచ్చేవి. ఆ ఐదేళ్లూ ఆ హామీలు అలాగే ఉండిపోయేవి. కానీ వైఎస్ జగన్ సర్కారు ఆ పరిస్థితులను మార్చింది. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం నేతన్న నేస్తం అమలు చేసింది. చెప్పిన తేదీకి చెప్పినట్టుగా రూ.3వేలు పింఛన్ మంజూరు చేసింది. చేనేత కార్మికుడికి కళాకారుడిగా గౌరవం ఇచ్చింది. కష్టపడుతున్న కుటుంబాలకు కావాల్సిన సాయం అందజేసింది.



పింఛన్లు ఇలా..

జిల్లాలో 50 ఏళ్లు దాటిన 3,812 మంది చేనేత కార్మికులకు నెలకు రూ.3 వేలు చొప్పున చేనేత పింఛన్లు అందజేస్తున్నారు. నెలకు రూ. 1కోటి14 లక్షల 36 వేలు అందజేస్తున్నారు. నేషనల్ నేషనల్ హ్యాండ్‌లూమ్ ప్రోగ్రాం కాంపోనెంట్‌లో భాగంగా జిల్లాలో మూడు క్లస్టర్లను ఏర్పాటు చేశారు. పొందూరు-1 క్లస్టర్‌కు 243 మందికి రూ. 99.5 లక్షలు, పొందూరు-2 క్లస్టర్‌కు 220 మందికి రూ. 105.48 లక్షలు, తోలాపి క్లస్టర్‌కు 111 మందికి రూ. 92.01 లక్షలు అందజేశారు.

మమ్మల్ని ఆదుకునే నాయకుడు



జగనన్న పాదయాత్రలో మా కష్టాలను చూశారు. ఎన్నికల మేనిఫెస్టోలో హామీనిచ్చి మాట నిలబెట్టుకున్నారు. ఏడాదికి రూ. 24 వేలు చొప్పున రూ. 1.20లక్షలు నా ఖాతాలో జమచేశారు. పింఛన్ నెలకు రూ. 3 వేలు అందుతోంది. నేత కార్మికుల అభివృద్ధికి దోహదం చేస్తున్నారు. మమ్మల్ని ఆదుకునే నిజమైన నాయకుడు మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి. – బస్వా మోహనరావు, చేనేత కార్మికుడు, పొందూరు

చేయూతనిచ్చారు..



రాత్రి, పగలు మగ్గం మీద పని చేస్తున్నప్పటికీ కడుపు నింపుకోలేకపోతున్న మా జీవితాలకు సీఎం వైఎస్ జగన్ భరోసానిచ్చారు. వైఎస్ఆర్ నేతన్న నేస్తం పథకం కింద జమ చేసిన రూ. 24 వేలును సద్వినియోగం చేసుకుంటున్నాం. నేతన్నలకు చేదోడు వాదోడుగా నిలిచారు. చేనేత కార్మికులకు అండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిలిచింది. – మందుల హేమసుందరరావు, చేనేత కార్మికుడు, పొందూరు.

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై కూటమి దుష్ప్రచారం



ధర్మపురం గ్రామంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

పొందూరు: ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై కూటమి అడ్డగోలుగా దుష్ప్రచారం చేస్తోందని, ఆమదాలవలస నియోజకవర్గం అభ్యర్థి తమ్మినేని సీతారాం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారం అనంతరం ధర్మపురం గ్రామంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు, పవన్, లోకేష్‌లు చట్టాలపై అవగాహన లేమితో ఉన్నారని అన్నారు. కేంద్రంలో బీజేపీ గెజిట్ తీసుకువచ్చిందన్నారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ చాలా గొప్పదని స్వయంగా టీడీపీ నేత పయ్యావుల కేశవ్ అసెంబ్లీలో చెప్పాడని, బిల్లుకు టీడీపీ సైతం సభలో మద్దతు ఇచ్చిందని గుర్తు చేశారు.

ఈ మధ్య కాలంలో చంద్రబాబు బృందం ప్రతి ఒక్కరికీ ఫోన్ చేసి అబద్ధాలు చెబుతున్నారని తెలిపారు. ఎవరి వద్దనైనా ప్రభుత్వం భూమిని లాక్కుందా అని ప్రశ్నించారు. 2014లో నందివాడలో చేతికి దెబ్బతగలిందని డ్రామాలాడావు, ఇప్పుడేమో కొత్త డ్రామాలకు తెరలేపుతావా అని కూన రవికుమార్‌ను ఉద్దేశించి మాట్లాడారు. ఇలాంటి డ్రామాలకు ఓట్లు పడవని, ప్రజలు నమ్మరని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మొదలవలస పాపారావు, మొదలవలస వెంకటరమణ, పప్పల అన్నాజీ, చల్ల ముఖలింగం, యతిరాజుల గోవింద, గాడు నాగరాజు, అనకాపల్లి రామకృష్ణ, వాసుదేవరావు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా

- వ్యయ పరిశీలకులు నవీన్ కుమార్ సోనీ



కంట్రోల్ రూంను తనిఖీ చేస్తున్న వ్యయ పరిశీలకులు నవీన్ కుమార్ సోనీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: సోషల్ మీడియా పోస్టులపై ప్రత్యేకంగా నిఘా ఉంచాలని, కంట్రోల్ రూమ్ సిబ్బంది మరింత అప్రమత్తంగా పనిచేయాలని ఎన్నికల వ్యయ పరిశీలకులు నవీన్ కుమార్ సోనీ ఆదేశించారు. ఆయన మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్‌ను సందర్శించారు. ఎంసీసీ నోడల్ అధికారులతో ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ వాట్సాప్, ట్విటర్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, షేర్‌చాట్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్ తదితర సోషల్ మీడియా కమ్యూనికేషన్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా వివిధ రకాల విషయాలపై పోస్టులు చేస్తుంటారని, అందులో ముఖ్యంగా ఎన్నికలకు సంబంధించిన అంశాలను గుర్తించాలని సూచించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా అభ్యర్థులు సోషల్ మీడియా ద్వారా వీడియోలు, ఫొటోలు, వాయిస్ రికార్డు, మెసేజ్‌లు, పోస్టర్లు పాంప్లెంట్ల ద్వారా ప్రచారం చేసుకుంటారని అన్నారు. సోషల్ మీడియా సెల్‌కు సంబంధించిన అధికారులు, సహాయ సిబ్బంది ప్రతి రోజూ పూర్తిస్థాయిలో ఆయా ప్లాట్‌ఫామ్స్‌ను పరిశీలించి, ఆ వివరాలను ఏఆర్‌ఓలకు పంపించి ఎక్స్పెండిచర్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని చెప్పారు. అలాగే జిల్లాకు సంబంధించిన అభ్యర్థులు, వ్యక్తులు, లింగ, కుల, మత, వర్గ విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా ఉన్నా, వ్యక్తిగత దూషణలు, తప్పుడు వార్తలు ప్రసారం చేయడం లాంటివి ఉన్నా వెంటనే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) నోడల్ అధికారికి పంపాలని సూచించారు. సోషల్ మీడియా సెల్ యాక్టివేట్‌గా ఉండాలని, సంబంధిత అంశాలను గుర్తించడం, కమ్యూనికేషన్, డాక్యుమెంటేషన్, రిపోర్టింగ్ సరైన పద్ధతిలో చేయాలన్నారు. అలాగే ఫేక్ న్యూస్‌లు, పెయిడ్ న్యూస్‌లపై ఎంసీఎంసీ కమిటీ ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

ఎన్నికల నోడల్ అధికారులైన జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్, సీపీఓ ప్రసన్నలక్ష్మి, డీఐపీఆర్‌ఓ చెన్నకేశవరావు, జిల్లా ఆడిట్ అధికారి సుల్తానా, జిల్లా గృహనిర్మాణ సంస్థ మేనేజర్ గణపతి రావు, గ్రామ వార్డు సచివాలయాల నోడల్ ఆఫీసర్ వాసుదేవరావు, జిల్లా ఖజానా అధికారి మోహన్ రావు తదితరులు వారి వారి పరిధిలో నిర్వహిస్తున్న అంశాలపై వ్యయ పరిశీలకులు నవీన్ కుమార్ సోనీకి వివరించారు.

దేవాలయంలో నకిలీ రశీదులతో వసూళ్లు

అరసవల్లి: జిల్లా కేంద్రంలోని ఓ ఆలయ అటెండర్ నకిలీ రశీదులతో చేస్తున్న మోసం బయటపడింది. శ్రీకాకుళం గుడివీధిలో ఉన్న శ్రీ ఉమారుద్ర కోటేశ్వర స్వామి ఆలయానికి ఉపాలయంగా ఉన్న శ్రీ ఆంజనేయ స్వామి వారి ఆలయానికి చెందిన 14.70 ఎకరాల భూముల నుంచి సుమారు రూ.3లక్షల ఉంచి రూ.5 లక్షల మేరకు రావాల్సిన శిస్తులకు ఆలయ అటెండర్ సతీష్ టోపీ పెట్టాడు. ఈ ఆలయ భూములను సేద్యం చేస్తున్న, లీజుల కింద అనుభవిస్తున్న వారి వద్ద నుంచి నకిలీ రశీదులతో శిస్తు వసూలు చేశాడు. అప్పట్లో ఆలయానికి ఈఓగా పనిచేసిన ఓ అధికారి అండదండలతోనే అటెండర్ సతీష్ ఇలా బరితెగించినట్లుగా దేవదాయ శాఖాధికారులు గుర్తించారు.

14.70 ఎకరాల భూముల నుంచి వసూళ్లు మాయం

ఉమారుద్ర కోటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీ ఆంజనేయ స్వామి వారి ఆలయానికి నగర నలువైపులా మెట్టు, పల్లం భూములు సుమారుగా 14.70 ఎకరాలున్నాయి. అయితే ఇవన్నీ దాదాపుగా లీజుల్లోనూ, సేద్యపు హక్కుల కిందనే నిబంధనల ప్రకారమే ఉన్నాయి. వీరంతా ఏటా లీజుల ప్రాప్తికి ఆలయానికి ఎకరా చొప్పున శిస్తులను చెల్లిస్తూ వస్తున్నారు. అయితే వాస్తవానికి ఈ ఫలసాయాన్ని నేరుగా సంబంధిత ఆలయ ఈఓ కలెక్ట్ చేసి రశీదును అందించాల్సి ఉంటుంది. అయితే ఉమారుద్ర కోటేశ్వర ఆలయంలో గత కొన్నేళ్లుగా అనధికారికంగా ఈ అటెండర్ సతీష్ నేరుగా రైతుల వద్దకు, లీజుదారుల వద్దకు వెళ్లి కలెక్ట్ చేసుకుని నకిలీ రశీదులను ఇచ్చేసి రూ.లక్షల్లో సొమ్మును జేబులో వేసేసుకున్నాడు. ఆలయ ఈఓగా కొద్ది నెలల కిందటే బాధ్యతలను చేపట్టిన సుకన్య ఆలయ డీసీబీ రికార్డును (డిమాండ్ కలెక్షన్ బ్యాలన్స్) చెక్ చేస్తే గత కొన్నేళ్లుగా లీజుదారుల నుంచి ఎలాంటి శిస్తులు చెల్లింపులు జరగలేదని, డీసీబీలో నమోదు కాలేదని గుర్తించి వారందరికీ నోటీసులు జారీ చేశారు. దీంతో బాధితులు ఇచ్చిన వివరణతో అటెండర్ సతీష్ నిర్వాకం బయటపడింది. ఈ వ్యవహారంపై శాఖాపరంగా విచారణ చేపట్టగా రైతులంతా న్యాయంగా చెల్లించిన శిస్తులన్నీ రికార్డులోకి రాకుండా సతీష్ జేబులోకి వెళ్లినట్లుగా గుర్తించారు.

అనధికారిక వసూళ్లు నిజమే..

కోటేశ్వరాలయ ప్రాంగణంలోని ఆంజనేయ స్వామికి 14.70 ఎకరాల భూములుంటే.. 2023 నుంచి ఎలాంటి శిస్తు వసూళ్లు డీసీబీలో ఎంటర్ కాలేదని గుర్తించాను. తీరా నోటీసులిస్తే నకిలీ రశీదులను చూపించారు. విచారణ చేపడితే అటెండర్ సతీష్ నిర్వాకమని తెలిసింది. వెంటనే అతనికి షోకాజ్ మెమో జారీ చేశాం. ఆ సమయం కూడా ముగియడంతో తదుపరి కఠిన చర్యలు చేపట్టనున్నాం. ఇప్పటికే ఈవిషయమై జిల్లా దేవదాయ శాఖాధికారి ప్రసాద్‌పట్నాయక్ కూడా చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. – ఎం.సుకన్య, ఆలయ ఈఓ

ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం: కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎన్నికల నియమ నిబంధనల మేరకు ముందస్తు ప్రణాళికలు పూర్తి చేసి, మే 13న ఎన్నికల నిర్వహణకు అన్ని విధాల సర్వ సన్నద్ధం కావాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం రాత్రి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన జిల్లాలోని రిటర్నింగ్ అధికారులు, ఈఆర్వో, ఏఈఆర్వో, ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందితో పలు అంశాలపై సమీక్షించి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికలకు సంబంధించి ఆయా నోడల్ అధికారుల టీంలు సమన్వయంతో అప్రమత్తంగా ఉంటూ పని చేయాలని స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని వసతులు కల్పించాలని, ఎక్కడైనా పెండింగ్‌లో ఉంటే అవి వెంటనే పూర్తి చేయాలని, ప్రతి నియోజకవర్గంలో బీఎల్‌ఓ ద్వారా ఓటర్ స్లిప్పుల పంపిణీ పూర్తి కావాలన్నారు. 13వ తేదీన జరిగే ఎన్నికల నిర్వహణకు 12వ తేదీన ఏర్పాటు చేసే డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల్లో ఏర్పాట్లను అంశాల వారీగా కలెక్టర్ సమీక్షించారు. ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ ప్లాన్, పార్కింగ్ ప్లాన్లు ప్రణాళికాబద్ధంగా ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్‌ఓలతో కూడిన ఓటరు హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేయాలన్నారు.

ఓటు వజ్రాయుధం



ఓటు హక్కు వినియోగంపై సైకత శిల్పి గేదెల హరికృష్ణ రూపొందించిన సైకత శిల్పం

ఆమదాలవలస రూరల్: ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని తెలియజేస్తూ వేసిన సైకత శిల్పం ఆకట్టుకుంటోంది. మండలంలో గాజులకొల్లివలస గ్రామం సమీపంలో సంగమేశ్వర ఆలయం వద్ద సైకత శిల్పి గేదెల హరికృష్ణ ఓటు హక్కును ఈవీఎం ద్వారా ఎలా వేయాలో తెలిపే సైకత శిల్పం ఇసుకతో అందంగా తీర్చిదిద్దాడు. ప్రజాస్వామ్యం పరిరక్షణ కోసం ఓటును తప్పనిసరిగా వేయాలని సూచించారు.

గంజాయి నిల్వల పట్టివేత



అధికారులు స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు

కంచిలి: మండలంలోని అంపురం జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టీ చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒక గుర్తు తెలియని వ్యక్తి గంజాయి రవాణా చేస్తుండటాన్ని గుర్తించారు. ఒక వ్యక్తి ఇచ్ఛాపురం వైపు నుంచి స్కూటీలో మూడు బ్యాగులను తీసుకొస్తుండగా వాహనం ఆపి ప్రశ్నించారు. ఈ బ్యాగుల్లో జీడిపప్పు రవాణా చేస్తున్నట్లు ఆ వ్యక్తి చెప్పడంతో, సంబంధిత బిల్స్ చూపించాలని అధికారులు కోరారు. దీంతో ఆ వ్యక్తి వాహనం ఆపి, అక్కడి నుంచి పరారయ్యాడు. ఆ స్కూటీలో ముందు భాగంలో ఒక బ్యాగు, వెనుక భాగంలో రెండు బ్యాగులు ఉన్నాయి. వాటిలో 40 ప్యాకెట్ల గంజాయిని తనిఖీ అధికారులు గుర్తించారు. ఒక్కో బ్యాగులో 2కిలోల 60గ్రాముల చొప్పున గంజాయి ఉంది. మొత్తంగా 82కిలోల570 గ్రాములు గంజాయి ఉన్నట్లు గుర్తించారు. దీని విలువ రూ.4,12,850లుగా గుర్తించారు. ఈ సరుకును పట్టుకున్న వారిలో డిప్యూటీ తహసీల్దార్ డి.సంతోష్, ఆర్‌అండ్‌బీ ఏఈ మోహనరావు, పోలీస్ కానిస్టేబుల్ అశోక్, విఆర్వోలు ఉమాపతి, కృష్ణారావు ఉన్నారు. ఈ సరుకును, స్కూటీని స్థానిక పోలీస్ స్టేషన్‌కు అప్పగించడంతో, దీనిపై స్థానిక ఎస్ఐ వి.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో పొందూరు యువకుడి ప్రతిభ



శ్రీలంకలో పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకాన్ని అందుకుంటున్న గంటా రాజశేఖర్

పొందూరు: మండల కేంద్రానికి చెందిన గంటా రాజశేఖర్ అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. శ్రీలంకలో ఈ నెల 3 నుంచి 7 వరకు జరిగిన పోటీల్లో 74 కేజీల జూనియర్ విభాగంలో బంగారు పతకం కైవసం చేసుకున్నాడు. పవర్ లిఫ్టింగ్‌లో పొందూరుకు చెందిన కోచ్ డేగల రాము వద్ద శిక్షణ పొందిన రాజశేఖర్ అంతర్జాతీయ పోటీల్లో విశేషంగా రాణిస్తున్నాడు. ప్రతిభ చూపిన రాజశేఖర్‌ను పలువురు ప్రసంశించారు.